266 మంది లబ్ధిదారులకు
కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, అరెకపూడి గాంధీ

కూకట్‌పల్లి: నిరుపేద ఆడబిడ్డ పెళ్లికి దేశంలో ఎక్కడా ప్రవేశపెట్టనటువంటి పథకాన్ని మానవతా దృక్పథంతో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టారని.. ఇప్పటికే కూకట్‌పల్లి నియోజకవర్గంలో 18వేల మందికి కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశామని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. సోమవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావులు 266 మంది లబ్ధిదారులకు కూకట్‌పల్లి ఎంఆర్‌ఓ కార్యాలయంలో చెక్కులు పంపిణీ చేశారు.

◆ ఈ సందర్భంగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాట్లాడుతూ... చెక్కులు అందించే సమయంలో కుటుంబ సభ్యులకు భోజన సదుపాయం కల్పించి, ప్రతి ఆడబిడ్డను గౌరవించి చెక్కులు పంపించేవాళ్లమన్నారు. కానీ నేడు ప్రభుత్వ సూచన మేరకు ఎంఆర్‌ఓ కార్యాలయంలో నిర్వహించాల్సి వచ్చిందని తెలిపారు. మంచి పని చేసినప్పుడు ఎవరినైనా అభినందించాల్సిన అవసరం ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు లక్ష 116తో సహా తులం బంగారం అందిస్తే సంతోషిస్తామని అన్నారు.

◆ ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మాట్లాడుతూ.. తామెప్పుడు ప్రజల పక్షానే ఉంటామని ప్రజల కోసం మంచిచేసే ఏ ప్రభుత్వానైనా సమర్థిస్తామన్నారు. సంక్షేమమే ధ్యేయం, అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళ్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మందగగి శ్రీనివాసరావు, జూపల్లి సత్యనారాయణ, సబిహా బేగం, పగుడాల శిరీష బాబూరావు, ఎంఆర్‌ఓ స్వామి, మాజీ కార్పొరేటర్‌లు తూము శ్రావణ్ కుమార్, పగుడాల బాబురావు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ అడ్మిషన్లు పకడ్బందీగా జరగాలి

రీసెర్చ్ స్కాలర్స్ అసోసియేషన్ నాయకుల వినతి


అధికారికి వినతిపత్రం అందజేస్తున్న రీసెర్చ్ స్కాలర్స్ అసోసియేషన్ నాయకులు

బాలానగర్: జేఎన్‌టీయూహెచ్ రీసెర్చ్ స్కాలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డిప్యూటీ డైరెక్టర్ డా. సైదా నాయక్‌కు పార్ట్‌టైం పీహెచ్‌డీ అప్లికేషన్స్ విషయమై సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు చల్లా రామకృష్ణ మాట్లాడుతూ... కొన్ని సంవత్సరాలుగా జరుగుతున్న పీహెచ్‌డీ అడ్మిషన్ల దరఖాస్తులలో 2, 3 ఎన్‌ఓసీలు తప్పుగా సృష్టించి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసిందేనన్నారు. నూతనంగా వచ్చిన పార్ట్‌టైం పీహెచ్‌డీ నోటిపికేషన్‌కి సంబంధించిన దరఖాస్తుల సేకరణ విషయంలో విద్యార్థుల దరఖాస్తుకి ప్రస్తుతం వారు చేస్తున్న ఉద్యోగానికి సంబంధించిన ఆఫర్, అపాయింట్‌మెంట్ లెటర్లు, ఎన్‌ఓసీ జతపరుస్తూ కంపెనీకి సంబంధించిన మెయిల్ ఐడీ, మొబైల్ నంబర్ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పరిశోధక విద్యార్థులు జవ్వాజి దిలీప్, సందీప్, భరత్, విద్యార్థి నాయకులు పవన్, రాహుల్, శివకృష్ణ, బ్రహ్మం, వంశీ, మనోజ్, శశిప్రీతమ్, ప్రియతమ్ రాజ్, రంజిత్, సాయి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు కొత్త భవనం

బాలానగర్: బాలానగర్ డివిజన్ పరిధిలోని చెరబండ రాజునగర్‌లోని ప్రాథమిక పాఠశాల పాత భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఈ స్థలంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి చొరవతో గ్లాండ్ ఫార్మా లిమిటెడ్ వారి సహకారంతో రెండు అంతస్తుల నూతన పాఠశాల భవనాన్ని నిర్మిస్తున్నారు. సోమవారం ఆ పనులను కార్పొరేటర్, సైట్ ఇంజినీర్‌తో కలిసి పర్యవేక్షించారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రంగంపేట్ శ్రీనివాస్ ముదిరాజ్, స్వామిగౌడ్, చిలుక సాగర్, ఒదయ్య, చంద్రయ్య, బాలరాజ్, బిట్టు తదితరులు పాల్గొన్నారు.


భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి

ఆస్‌బెస్టాస్‌హిల్స్ కాలనీ ఎన్నికల్లో నరేష్ ప్యానల్ విజయం

అల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ ఆస్‌బెస్టాస్ హిల్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు సోమవారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడు ఎం.నరేష్, ఉపాధ్యక్షుడు నర్సింహులు, జాయింట్ సెక్రటరీ అబ్దుల్ రఫీక్, ట్రెజరర్ పుష్ప, జనరల్ సెక్రటరీ మహమూద్ హుస్సేన్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఎం.నరేష్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి తమ ప్యానల్ సభ్యులను అత్యంత మెజార్టీతో గెలిపించిన ఓటర్లుకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. కొన్ని సంవత్సరాలుగా కాలనీ అభివృద్ధి కుంటు పడిపోవటం వల్లనే ప్రజలకు విసుగు చెందిన తమను భారీ మెజార్టీతో గెలిపించారని పేర్కొన్నారు. కాలనీలో ఉన్న ప్రధాన సమస్య తాగునీరు, కాలనీ లే అవుట్ క్రమబద్ధీకరించడం, హౌసింగ్ సొసైటీ, వెల్ఫేర్ సొసైటీలను ఏకతాటిపైకి తీసుకువచ్చి ప్రజా ప్రతినిధులు, అధికారులతో చర్చించి సమస్యల పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

బీజేపీ బైక్ ర్యాలీ..


బైక్ ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ కొడిచర్ల మహేందర్, వడ్డేపల్లి రాజేశ్వరరావు

మోతీనగర్: 'అబ్ కీ బార్.. చార్ సౌ పార్'అనే నినాదంతో సోమవారం పాండురంగనగర్ నుంచి కబీర్‌నగర్ మోతీనగర్, అల్లాపూర్‌ల మీదుగా హైటెక్ సిటీ నుంచి మూసాపేట వరకు బీజేపీ కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మూసాపేట కార్పొరేటర్ కొడిచర్ల మహేందర్ మాట్లాడుతూ... మూడోసారి దేశ ప్రధానిగా నరేంద్రమోదీ పదవీ బాధ్యతలు చేపట్టడం ఖాయమన్నారు. కేంద్రంలో నరేంద్ర మోదీ పాలనకు ప్రజలు ఆకర్షితులై తిరిగి మోదీ ముచ్చటగా మూడవసారి ప్రధాని కావాలని ఆకాంక్షిస్తున్నారని తెలిపారు. బీజేపీ కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ.. యూపీఏ పాలనలో ప్రజలు ఎన్నో అష్ట కష్టాలు పడ్డారని ఎన్డీయే పాలనలో సుఖ సంతోషాలతో, సుభిక్షంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది బీజేపీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సెప్టిక్ ట్యాంక్ స్థలం కబ్జా.!

● రూ.కోట్ల విలువ చేసే స్థలం అమాయకులకు విక్రయాలు ● నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్న అధికారగణం



దత్తాత్రేయ కాలనీలోప్రభుత్వ సెప్టిక్ ట్యాంక్ స్థలంలో చేపట్టిన అక్రమ నిర్మాణాలు

అల్విన్‌కాలనీ: ప్రజల అవసరాల కోసం వినియోగించాల్సిన స్థలాలను భూభకాసురులు సెప్టిక్ ట్యాంక్‌ను సైతం వదలకుండా అక్రమ నిర్మాణాన్ని నిర్మించటమే కాక కోట్ల రూపాయలకు అమ్మకానికి సిద్ధం చేశారు. వివరాల్లోకి వెళ్తే కూకట్‌పల్లి మండల పరిధిలోని దత్తాత్రేయకాలనీలో 30 సంవత్సరాల క్రితం నగరంలోని వివిధ ప్రాంతాల్లో నివసించే పేదలను దృష్టిలో ఉంచుకొని ఫ్యామిలి ప్లానింగ్ ఆపరేషన్‌లు చేయించుకున్న వారికి 50 గజాల చొప్పున ఇళ్ల స్థలాలను కేటాయించారు. ఆ స్థలాల్లో మురుగు రోడ్లపై ప్రవహించకుండా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవటంతో ఆ కాలనీలో సుమారు వెయ్యి గజాల స్థలం సెప్టిక్ ట్యాంక్ కోసం కేటాయించారు. అయితే కాలక్రమేణా అండర్‌గ్రౌండ్ సిస్టమ్ రావటంతో ఆసెప్టిక్ ట్యాంక్ వృథాగా ఉండటంతో కబ్జాదారుల కన్ను పడింది.

◆ నేడు భూముల విలువ ఆకాశాన్ని అంటడంతో ఆ స్థలంపై భూ కబ్జాదారుల కన్నుపడింది. గత మూడు రోజులుగా వరుస సెలవులు రావటంతో తమ పని తేలిగ్గా అవుతుందని భావించారు భూ బకాసురులు. తెల్లారేసరికి పాత స్థలాల పట్టాల స్థానంలో కొత్త పట్టాలను సృష్టించి నిర్మాణాలు చేపడుతున్నారు. గతంలో ఇదే స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడితే మరుసటి రోజే అధికారులు కూల్చివేశారు. ప్రస్తుతం తిరిగి అదే స్థలంలో భారీ అక్రమ నిర్మాణాలు చేపట్టి సున్నాలు వేసి కుటుంబంతో సహా నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో మున్సిపల్ అధికారులు నోటీసులు అందజేసి చేతులు దులుపుకుంటున్నారని స్థానికులు వాపోతున్నారు.

◆ మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులకు లక్షల్లో ముట్టజెప్పి తమ కాలనీ అవసరాల కోసం వినియోగించే సెప్టిక్ ట్యాంక్ స్థలాన్ని కబ్జాలకు పాల్పడుతుంటే అధికారులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. కోట్ల రూపాయల విలువ చేసే సెప్టిక్ ట్యాంక్ స్థలాన్ని లక్షల రూపాయలకు అమ్మకానికి పెట్టి కబ్జాదారులు పేద, మధ్య తరగతి ప్రజలకు అంటగట్టి చేతులు దులుపుకోవాలని చూస్తున్నారు. సెప్టిక్ ట్యాంక్ స్థలంలో నిర్మించిన నిర్మాణాలను నేలమట్టం చేసి ఆ స్థలంలో పార్కు, సంక్షేమ సంఘం భవనం, బస్తీ దవాఖానా వంటి వాటి కోసం వినియోగించేలా కూకట్‌పల్లి మున్సిపల్ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్లు చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



ప్రజావాణిలో 42 ఫిర్యాదులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో పలువురు కూకట్‌పల్లి జోనల్ కమీషనర్ అభిలాష అభినవ్‌కు పలు సమస్యలపై ప్రజావాణిలో సోమవారం ఫిర్యాదు చేశారు. మూసాపేట 2, కూకట్‌పల్లి 1, కుత్బుల్లాపూర్ 4, గాజులరామారం 4, ఆల్వాల్ 3, కూకట్‌పల్లి జోనల్ పరిధిలో 28, మొత్తం 42 మంది ఫిర్యాదులు అందజేశారు. సమస్యలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని అధికారులను జెడ్‌సీ ఆదేశించారు.

సెవెన్‌హిల్స్ వేంకటేశ్వరస్వామి ఆలయ ఈఓగా సుధాకర్



భాగ్యనగర్‌కాలనీ: నిజాంపేట్, సెవెన్‌హిల్స్ వేంకటేశ్వరస్వామి దేవస్థానం నూతన ఇవో గ్రేడ్–2గా గుమ్మడిదల సుధాకర్‌ను సోమవారం నియమించారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తరువాత జరుగుతున్న బదిలీల్లో భాగంగా దేవాదాయ ధర్మాదాయశాఖ హైదర్‌నగర్ డివిజన్‌లో ఎంతో పేరు, ప్రాముఖ్యత ఉన్న వేంకటేశ్వరస్వామి దేవస్థాన ఈఓ సత్యచంద్రారెడ్డిని ప్రభుత్వం, దేవదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్‌ను బదిలీ చేశారు. ఆయన స్థానంలో నూతన ఈఓ గ్రేడ్–2గా గుమ్మడిదల సుధాకర్‌ను నియమించారు.

పవర్ లిఫ్టింగ్‌లో పాతపల్లి శివకు సిల్వర్ మెడల్


పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించిన శివ

మూసాపేట: పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మూసాపేటకు చెందిన పాతపల్లి శివ సిల్వర్ మెడల్ సాధించారు. చందానగర్‌లో పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ ఆధ్వర్యంలో ఆదివారం పవర్ లిఫ్టింగ్ పోటీలు జరిగాయి. 59 కేటగిరిలో మూడో రౌండ్‌లో 290 కేజీల బరువును ఎత్తి సిల్వర్ మెడల్ సాధించారు. అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌గౌడ్ చేతుల మీదుగా మెడల్‌ను అందుకున్నారు. భవిష్యత్‌లో మరిన్ని మెడల్స్ సాధించాలని కోరారు.

ప్రజావాణి.. 7 వినతులు

హఫీజ్‌పేట్: చందానగర్ సర్కిల్ –21 కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం ఉపకమిషనర్ వంశీకృష్ణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 07 వినతిపత్రాలు అందగా, 6 టౌన్ ప్లానింగ్‌కు, మరొకటి ఇంజనీరింగ్ సెక్షన్‌కు సంబంధించిన ఫిర్యాదు చేశారన్నారు. వీటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు.

శేరిలింగంపల్లిలో..

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో సోమవారం డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో 8 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి 5 దరఖాస్తులు రాగా, ప్రాపర్టీ ట్యాక్స్‌లకు సంబంధించి 3 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

హఫీజ్‌పేట్: చందానగర్ డివిజన్‌లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ మంజుల అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని అన్నపూర్ణ ఎన్‌క్లేవ్‌లో చేపట్టిన సీసీ రోడ్డు పనులను స్థానికులతో కలిసి ఆమె పరిశీలించారు.

ఆర్టీసీ కార్మికులూ ప్రభుత్వ ఉద్యోగులే..

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం


కూకట్‌పల్లి డిపో వద్ద సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మూసాపేట: ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారికి ప్రభుత్వ ఉద్యోగులలాగా జీతభత్యాలు, అన్ని రకాల వసతులు సమకూర్చే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందని అనడంతో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. సోమవారం కూకట్‌పల్లి ఆర్టీసీ డిపో వద్ద ఆర్టీసీ కార్మికులు, కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రవాణా, బీసీ వెల్ఫేర్ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే తప్పకుండా నెరవేరుస్తుందనడానికి ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన ఫిట్‌మెంట్‌టే ఉదాహరణ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండి రమేష్, నాయకులు సత్యం శ్రీరంగం, పటోళ్ల నాగిరెడ్డి, తూము మనోజ్‌కుమార్, తూము వేణు, పుష్పరెడ్డి, శేరి సతీష్‌రెడ్డి, కొప్పిశెట్టి దినేష్, రేష్మ, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత


ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందజేసిన బండి రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు

కూకట్‌పల్లి: జీవనోపాధి కోసం కొన్ని సంవత్సరాల క్రితం నగరానికి వచ్చి కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బాలాజీనగర్‌లో నివసిస్తున్నాడు. ఇటీవల ఆయన రక్తనాళాలు సరిగ్గా పనిచేయకపోవడంతో ఆయన కుమారుడు కాంగ్రెస్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావును కలిసి పరిస్థితి వివరించారు. దీంతో వెంకటేశ్వరరావు వారిని నిమ్స్ ఆసుపత్రికి పంపించి అక్కడి వైద్యులను సంప్రదించి ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేయించారు. ఈ మేరకు మంజూరైన రూ.1.6లక్షల చెక్కును సోమవారం కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శేరిసతీష్‌రెడ్డి, తూము వేణు, సంజీవ, మేకల మైకేల్ తదితరులు పాల్గొన్నారు.

ఎలక్టోరల్ బాండ్ వివరాలను ఎస్‌బీఐ వెల్లడించాలి

సీపీఎం నాయకుల డిమాండ్



ప్రశాంత్‌నగర్‌లోని ఎస్‌బీఐ ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

కూకట్‌పల్లి: ఎలక్టోరల్ బాండ్ వివరాలను సుప్రీం కోర్టుకు తెలియజేయాలని, లేకపోతే ఎస్‌బీఐ బ్యాంక్ చైర్మన్‌ను అరెస్టు చేయాలని కూకట్‌పల్లి, ప్రశాంతినగర్‌లోని ఎస్‌బీఐ ఎదుట సీపీఎం కూకట్‌పల్లి మండల కమిటీ నాయకులు సోమవారం నిరసన తెలిపారు. బీజేపీ ప్రభుత్వం అనుసరించిన ఎస్‌బీఐ బాండ్ల కొనుగోలు విషయంలో గోప్యత పాటించటం వెనక దేశ ప్రజానికానికి అనుమానాలు ఉన్నాయని అన్నారు. ఆ వివరాలను వెంటనే వెల్లడించాలని బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. వివరాలను తెలియజేయాలని సుప్రీం కోర్టు చెప్పినా ఎస్‌బీఐ చైర్మన్ వివరాలు ఎందుకు దాస్తున్నారో చెప్పాలన్నారు. ఈ బాండ్లలో పెద్ద అవినీతి బాగోతం దాగి ఉందన్నారు. పార్లమెంట్ ఎన్నికల వరకు ఈ విషయాన్ని గోప్యంగా ఉంచాలని ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.కృష్ణ నాయక్, ధర్మారావు, తాజుద్దీన్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

తాగిన మైకంలో యువకుడు హల్‌చల్

హోటల్ యజమాని, కానిస్టేబుల్‌పై దాడి


నిందితుడు రాజు యాదవ్

బాగ్యనగర్‌కాలనీ: మద్యం తాగిన ఓ యువకుడు టిఫిన్ కోసం హోటల్‌కి వెళ్లాడు. తనకు టిఫిన్ ఉచితంగా ఇవ్వాలని కోరగా హోటల్ నిర్వాహకురాలు అందుకు అంగీకరించకపోవడంతో మద్యం మత్తులో ఉన్న యువకుడు హోటల్ యజమానురాలితో పాటు అడ్డు వచ్చిన పోలీస్ కానిస్టేబుల్‌పై దాడి చేశాడు. ఈ సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం భాగ్యనగర్‌కాలనీ అర్జున్ థియేటర్ సమీపంలోని సిరి టిఫిన్స్ సెంటర్ దగ్గరకు ఎల్లమ్మ బండకు చెందిన రాజు యాదవ్ అనే వ్యక్తి అతిగా మద్యం సేవించి టిఫిన్ కోసం వచ్చాడు.

◆ తనకు టిఫిన్ ఉచితంగా పెట్టాలని, హోటల్ యజమానురాలు కుమారిని డిమాండ్ చేశాడు. ఆమె అందుకు నిరాకరించడంతో ఆమెను దుర్భాషలాడుతూ ఆమెపై హెల్మెట్‌తో దాడి చేశాడు. స్థానికులు 100కు డయల్ చేసి ఫిర్యాదు చేయటంతో అక్కడకు చేరుకున్న కానిస్టేబుల్ శశికాంత్‌రెడ్డి రాజుయాదవ్‌ను అడ్డుకునే ప్రయత్నించారు. మద్యం మత్తులో ఉన్న రాజుయాదవ్, కానిస్టేబుల్‌పై పిడిగుద్దులు కురిపించాడు. రాజు యాదవ్‌ను అడ్డుకుని పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

◆ అయితే ఈ హోటల్ ప్రతి రోజు అర్ధరాత్రి వరకు తెరిచి ఉండటంతో మందుబాబులకు అడ్డాగా మారింది. ఇక్కడ తరచూ గొడవలు జరగుతుంటాయి. రాత్రి, పగలు తేడా లేకుండా నిర్వహించే హోటల్ నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవడంతో పాటు హోటల్‌ను నిబంధనల ప్రకారం నడిపే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావును కోరుతున్నారు.

జపాన్‌ను సందర్శించిన హెచ్‌సీయూ పరిశోధక బృందం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిశోధక బృందం జపాన్‌ను సందర్శించింది. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్‌లోని ప్లాంట్ సైన్స్ విభాగం అధిపతి ప్రొఫెసర్ ఎస్ రాజగోపాల్ నాయకత్వంలోని పరిశోధక బృందం సాకురా సైన్స్ ఎక్స్‌చేంజ్ ప్రోగ్రామ్ అనే ప్రతిష్టాత్మక కార్యక్రమానికి ఎంపికయ్యారు. ఇది జపనీస్ ప్రభుత్వ శాస్త్రీయ విభాగం సహకారాన్ని ప్రోత్సహిస్తుంది. మార్చి 3వ తేదీ నుంచి 10వ తేదీ వరకు జపాన్‌లో పర్యటించి సోమవారం క్యాంపస్‌కు చేరుకున్నారు. ఈ కార్యక్రమాన్ని జపాన్‌లోని ఒకాయామా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ యుచిరో తకాహషి నాయకత్వం వహించారు. హెచ్‌సీయూ ప్రొఫెసర్లు ఎస్ రాజగోపాల్, డాక్టర్ వెంకటేశ్వరరావు, బృందంలోని సభ్యులు పవిత్రా రామచంద్రన్, జ్యోతిరంజన్‌రాత్, పులిమామిడి భరత్, జెరోమ్ జేవియర్, విజయ్ శ్రీనివాస్ లావుడియా, శ్రియా శర్మ, నమ్రతదూబే, శివ నాగసాయి దామరాజు వారం రోజులపాటు పర్యటించారు. కిరణజన్యసంయోగక్రియ, పరిశోధన, సరిహద్దులను అధిగమించడం, సహకార వృద్ధిని పెంపొందించే పరిశోధనలో పాల్గొన్నారు.

పీస్ కమిటీ సమావేశం

హఫీజ్‌పేట్: రంజాన్ మాసంను పురస్కరించుకుని సోమవారం న్యూ హఫీజ్‌పేట్‌లోని ఫ్రెండ్స్ ఫంక్షన్ హాల్‌లో రంజాన్ మాసం పీస్ కమిటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మియాపూర్ ఏసీపీ నర్సింహారావు మాట్లాడుతూ రంజాన్‌మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎవరికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దీక్ష చేసుకోవాలన్నారు. ప్రజలందరూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మియాపూర్ ఎస్‌హెచ్‌ఓ దుర్గా రామలింగ ప్రసాద్, డీఐ అక్రం బాబా, ఎస్‌లు దశరథ్, రాజు, వివిధ బస్తీల ముస్లింలు పాల్గొన్నారు.

ఏజీవర్సిటీలో ప్రత్యేక కోర్సులు ప్రారంభం

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజెమెంట్‌లో నాబార్డ్ సహాయంతో ప్రత్యేక కోర్సులను సోమవారం ప్రారంభించారు. కార్యక్రమానికి మహారాష్ట్ర నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ రష్మీ దారద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కోర్సులతో విశ్లేషణాత్మక సమస్య పరిష్కారం వ్యవస్థాపక నైపుణ్యాలు, మార్కెటింగ్ వ్యూహాత్మక నిర్వహన వంటివి నేర్చుకునే అవకాశం ఉంటుందన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థలు ఎదుర్కొంటున్న సవాళ్లు, స్థిరమైన వృద్ధికి ఈ అడ్డంకులను అధిగమించడంలో నాయకత్వం యొక్క కీలక పాత్రను ఆమె నొక్కి చెప్పారు. కార్యక్రమంలో ఐసీఏఆర్–నార్మ్స్ డైరెక్టర్ జనరల్ శ్రీనివాస్‌రావు,సైంటిస్ట్ సెంథిల్ ఇంతకుముందు శిక్షణ పొందిన రైతులు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఎఫ్‌పీఓలు, నాబార్డ్, నార్మ్స్ అధికారులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

శేరిలింగంపల్లి: మియాపూర్ సర్వే నంబర్ 28లో సీఆర్‌పీఎఫ్ క్యాంపు సిబ్బంది చేపట్టిన అదనపు నిర్మాణాలను వెంటనే నిలిపివేయాలని నడిగడ్డ తండావాసులు శేరిలింగంపల్లి తహశీల్దార్ వెంకారెడ్డిని సోమవారం కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా తండావాసి ఇస్లావత్ దశరథ్‌నాయక్ మాట్లాడుతూ దశాబ్దాలుగా బడుగు, బలహీన వర్గాల ప్రజలు నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నారని, వారికి మౌలిక వసతులు కల్పించి చట్టబద్ధత కల్పించాలని కోరారు. సీఆర్‌పీఎఫ్ నిర్మాణాలను వెంటనే నిలిపివేయాలని రెవెన్యూ అధికారులను కోరారు. కార్యక్రమంలో నడిగడ్డా తండావాసులు హన్మనాయక్, కృష్ణ నాయక్, వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ వ్యవస్థకు మహిళలు దూరం కావొద్దు

జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి. సింధు

రాయదుర్గం: భారతదేశం త్వరలో సాధించాలనుకునే పది ట్రిలియన్ ఆర్థికాభివృద్ధి ముఖ్యంగా మహిళలతోనే సాధ్యమని జేఎన్‌టీయూ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డి. సింధు పేర్కొన్నారు.సోమవారం గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలోని చాణక్య హాల్‌లో ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆమెను ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జీ రామేశ్వరరావు ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వ్యవసాయం, నిర్మాణ రంగం, మ్యానుఫాక్చరింగ్ రంగాలలో ప్రస్తుతం భారత మహిళలు దూసుకుపోతున్నారన్నారు. ఇప్పటికే దేశంలోని ఐటీరంగంలో సగానికి పైగా మహిళలే ఉన్నారన్నారు. ఎన్ని రంగాల్లో అభివృద్ధి సాధించినప్పటికీ కుటుంబ వ్యవస్థకు మహిళలు దూరం కావద్దన్నారు. ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచంలో స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానమేనని, స్త్రీ లేనిదే పురుషుడు లేడని, అభివృద్ధిలో ఇద్దరూ సమానమేనన్నారు.కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ పోస్టు గ్రాడ్యుయేట్ స్టడీస్ ప్రిన్సిపల్ డాక్టర్ జగన్‌మోహన్ రావు,ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి డాక్టర్ లీల, డాక్టర్ రమణి, కాలేజ్ చీఫ్ లక్ష్మీకాంతరావు ప్రసంగించారు. కార్యక్రమంలో ఎస్కీ అధికారులు, ఉద్యోగులు,విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్కీకి గోల్డెన్ పీకాక్ అవార్డు

రాయదుర్గం: ప్రతిష్టాత్మకమైన గోల్డెన్ పీకాక్ అవార్డు–2024ను గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వరరావు స్వీకరించారు. అబుదాబిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా సోమవారం గచ్చిబౌలిలోని ఎస్కీ క్యాంపస్‌లో అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రామేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచం ఎదుర్కొంటున్న పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులపై ఢిల్లీ కేంద్రంగా పనిచేసే ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ ఏటా నిర్వహించే ఈ గోల్డెన్ పీకాక్ అవార్డును ఈ ఏడాదికి ఎస్కీని ఎంపిక చేశారన్నారు. ఈ అవార్డు స్వీకరణతో మనపై బాధ్యత మరింత పెరిగిందని, భవిష్యత్తులో చేపట్టే ప్రతి కార్యక్రమం, శిక్షణా కార్యక్రమంలో మరింత బాధ్యతాయుతంగా నిర్వహించాలన్నారు. అందరూ సమష్టిగా పనిచేస్తే విజయం సాధిస్తామనడానికి ఈ అవార్డు రావడమే నిదర్శనమన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

● కాటేదాన్ నుండి కర్ణాటకకు
● లారీలో తరలిస్తున్న 35 టన్నుల బియ్యం పట్టుకున్న సీసీఎస్ పోలీసులు

పటాన్‌చెరు టౌన్: లారీలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సీసీఎస్ పోలీసులు పటాన్‌చెరు మండల పరిధిలో రుద్రారం గ్రామ సమీపంలోని రిమ్ జిమ్ దాబా వద్ద పట్టుకున్నారు. సీసీఎస్ పోలీసులు, సివిల్ సప్లై అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్ కాటేదాన్ నుండి కర్ణాటక లారీలో అక్రమంగా 35 టన్నుల 475 కిలోల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా కర్ణాటక పాసింగ్‌కి చెందిన లారీని ఆదివారం రాత్రి పట్టుకున్నారు. లారీలు సీజ్ చేసి, రేషన్ బియ్యాన్ని పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇద్దరిపై కేసు నమోదు చేశారు. లారీ డ్రైవర్ సాగిర్ బాయ్ వాగ్లే, పూర్మార్ వక్కలను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.